ధనిక రైతులపై పన్ను?

కేంద్రానికి ఎంపీసీ సభ్యురాలు అషిమా గోయల్ సూచన

న్యూఢిల్లీ, జనవరి 17: దేశంలో ధనిక రైతులపై పన్ను విధించటం సబబుగానే ఉంటుందని రిజర్వ్‌బ్యాంకు మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సభ్యురాలు అషిమా గోయల్ అన్నారు. ఈ మేరకు ధనిక రైతులపై పన్ను విధించే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. వచ్చే నెల 1న కేంద్ర ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో అషిమా గోయల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భారత్‌లో వ్యవసాయ ఆదాయంపై పన్ను విధించటం సబబేనా అన్న ప్రశ్నకు బుధవారం ఓ కార్యక్రమంలో ఆమె సమాధానమిస్తూ 'పేద రైతులకు ప్రభుత్వం నగదు బదిలీ చేయటం రుణాత్మక ఆదాయ పన్నులాంటిది. అలాగే ధనిక రైతులపై తక్కువ శాతంలో ధనాత్మక ఆదాయ పన్ను విధించటం సబబుగానే ఉంటుంది' అని పేర్కొన్నారు. సంకీర్ణ ప్రభుత్వాలతో స్వల్పకాలిక ఆర్థిక వృద్ధి మాత్రమే సాధ్యమవుతుందని, ఏక పార్టీ ప్రభుత్వాల వల్ల దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధి నమోదవుతుందని తెలిపారు.

ఇచ్చినట్టే ఇచ్చి.. వెనక్కి!

- ఎవుసం కేటాయింపుల్లో ఖర్చు పెట్టేది కొంతే
- మిగతా సొమ్మంతా తిరిగి ఖజానాకే మళ్కింపు
- గడిచిన ఐదేండ్ల వ్యవధిలో రూ. లక్ష కోట్లు వెనక్కి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): వరదలు, కరువు కాటకాల వంటి ప్రకృతి సంక్షోభాలు ఒకవైపు.. తీసుకొన్న అప్పు మరోవైపు.. వెరసి రైతన్న దిక్కుతోచని స్థితికి వెళ్లిపోతున్నాడు. అయితే, అన్నదాతను ఆదుకోవాల్సిన కేంద్రప్రభుత్వం వేడుక చూస్తున్నది.

ఆర్థిక సంవత్సరం	ఖజానాకు మళ్లిన నిధులు (రూ. కోట్లలో)
2018-19	21,043.75
2019-20	34,517.7
2020-21	23,824.53
2021-22	5,152.6
2022-23	21,005.13

బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి కేటాయించిన నిధులను కూడా సక్రమంగా ఖర్చు చేయట్లేదు. మెజారిటీ నిధులను తిరిగి ఖజానాకే మళ్లిస్తున్నది. ఈ మేరకు కేంద్ర వ్యవసాయశాఖ తాజా గణాంకాల్లో తేలింది. ఇలా గడిచిన ఐదేండ్లలో సాగుకు కేటాయించిన నిధుల్లో రూ. లక్ష కోట్లకు పైగా నిధులు కేంద్ర ఖజానాకే తిరిగి చేరినట్టు తేటతెల్లమైంది.

ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్

ఎస్‌కేఎం, కార్మిక సంఘాల ప్రకటన ● కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన

న్యూఢిల్లీ, జనవరి 17: మోదీ సర్కార్ విధానాలను నిరసిస్తూ కార్మిక, కర్షక సంఘాలు దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చాయి. ఫిబ్రవరి 16న దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను ఏకకాలంలో చేపడుతున్నట్టు రైతు సంఘాల ఐక్య వేదిక 'సంయుక్త కిసాన్ మోర్చా' (ఎస్‌కేఎం), కేంద్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు, అసోసియేషన్లు తాజాగా ప్రకటించాయి. పంటలకు కనీస మద్దతు ధర అమలుజేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని కార్మిక, కర్షక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పశ్చిమాసియాలో మంటలు!

పశ్చిమాసియా రగులుతున్నది. యుద్ధం మరిన్ని దేశాలకు విస్తరిస్తుండటం కలవరపరుస్తున్నది. హమాస్-ఇజ్రాయెల్ యుద్ధంతో మొదలైన ఉద్రిక్తతలు మరింత ముదురుతున్నాయి. హమాస్‌కు మద్దతుగా ఎర్ర సముద్రంలో నౌకలే లక్ష్యంగా హౌతీల దాడులు, ప్రతిగా హౌతీ స్థావరాలపై అమెరికా, బ్రిటన్ విరుచుకుపడటం.. తాజాగా ఇరాక్, సిరియా, పాకిస్థాన్‌లపై ఇరాన్ వరుస దాడులకు దిగడం పశ్చిమాసియాను కుదిపేస్తున్నది. గత రెండు సంవత్సరాలుగా ఉక్రెయిన్-రష్యా యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో తాజా పరిణామాలు మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తాయా? అన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

మధ్యప్రాచ్యంలో నిత్యం బాంబుల మోత

- కొనసాగుతున్న హమాస్-ఇజ్రాయెల్ యుద్ధం
- ఎర్ర సముద్రంలో హౌతీల దాడుల పర్వం
- హౌతీ సైనిక స్థావరాలపై అమెరికా క్షిపణులు
- తాజాగా అగ్నికి ఆజ్యం పోసిన ఇరాన్ చర్యలు
- ఇరాక్, సిరియా, పాకిస్థాన్‌పై వరుస దాడులు
- ఇరాన్ రాయబారిని బహిష్కరించిన పాక్
- తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరిక
- పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు
- మూడో ప్రపంచ యుద్ధంపై భయాందోళనలు

ఇరాన్ క్షిపణి

టెహ్రాన్, జనవరి 17: దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియా అట్టుడుకుతున్నది. పలు దేశాల్లో నిత్యం బాంబుల మోత మోగుతుండటంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు. హమాస్-ఇజ్రాయెల్ యుద్ధంతో మొదలైన ఉద్రిక్తతలు.. తాజాగా ఇతర దేశాలకూ విస్తరించాయి. తాజాగా పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రాంతంలో ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ మంగళవారం దాడులు చేసింది. సున్నీ మిలిటెంట్ గ్రూపు జైష్ అల్ అదిల్‌కు చెందిన రెండు ప్రధాన స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. దీనిపై పాకిస్థాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇరాన్ తమ గగనతల ఉల్లంఘనకు పాల్పడిందని, దాడుల్లో ఇద్దరు చిన్నారులు మరణించారని పేర్కొన్నది. తమ దేశంలోని ఇరాన్ రాయబారిని కూడా బహిష్కరిస్తున్నట్టు బుధవారం వెల్లడించిన పాక్.. అలాగే ఆ దేశంలో ఉన్న తమ రాయబారిని కూడా వెనక్కు పిలిపించుకొన్నది. ఇరాన్ చర్యలకు తీవ్ర పరిణామాలు ఉంటాయని పాక్ విదేశాంగ శాఖ హెచ్చరించింది.

క్షిపణి శక్తిని ఉపయోగిస్తాం

ఇరాన్ దాడుల తర్వాత పాకిస్థాన్, ఆఫ్గాని స్థాన్‌తో సరిహద్దులు పంచుకొనే సిస్తాన్ ప్రావిన్స్‌లో ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్(ఐఆర్‌జీ)కి చెందిన సభ్యుడిని గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిచంపడం సంచలనంగా మారింది. మరోవైపు శత్రువులను ఎదుర్కొనేందుకు తమ క్షిపణి శక్తిని వినియోగించుకోవడానికి ఎంత మాత్రం వెనుకాడబోమని ఇరాన్ రక్షణ శాఖ మంత్రి మహ్మద్ రేజా స్పష్టం చేశారు.

దాడులకు ప్రతిదాడులు..

హమాస్-ఇజ్రాయెల్ యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. హమాస్‌కు ఇరాన్, యెమెన్ హౌతీలు మద్దతుగా ఉంటున్నాయి. ఎర్రసముద్రంలో అమెరికా, మిత్రదేశాల వాణిజ్య నౌకలపై హౌతీలు వరుస దాడులకు పాల్పడుతున్నారు. హెచ్చరికలను పెడచెవిన పెట్టడంతో యెమెన్‌లోని హౌతీ సైనిక స్థావరాలపై గత వారం అమెరికా, బ్రిటన్ క్షిపణులతో దాడులు చేశాయి. దాడికి ప్రతిదాడి అన్నట్టుగా హౌతీలు తాజాగా సోమవారం యెమెన్ తీరంలోని గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లో అమెరికా నౌకపై యాంటీ షిప్ క్షిపణితో దాడి చేశారు. ఈ నేపథ్యంలో హౌతీలను మళ్లీ గ్లోబల్ టెర్రరిస్టు జాబితాలో చేరుస్తూ బైడెన్ సర్కార్ బుధవారం నిర్ణయం తీసుకొన్నదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

ఏమిటీ జైష్ అల్ ఆదిల్?

పాక్‌పై దాడుల్లో భాగంగా ఇరాన్ తాజాగా టార్గెట్ చేసుకొన్న ఉగ్రవాద గ్రూపు 'జైష్ అల్ ఆదిల్'పై ప్రస్తుతం చర్చ నడుస్తున్నది. 2012లో స్థాపించబడిన ఈ సంస్థ 2013లో దాడి చేసి 14 మంది ఇరాన్ గార్డులను చంపడంతో వార్తల్లోకి వచ్చింది. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తూ ఇరాన్‌లోని సిస్తాన్-బలూచిస్థాన్‌లో తన కార్యకలాపాలను నిర్వహిస్తున్నది. తన ఉనికిని చాటుకొనే ప్రయత్నంలో భాగంగా ఇరాన్ సరిహద్దుల్లో పోలీసులు, జవాన్లను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడింది. వరుసగా పలు హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్న క్రమంలో ఈ గ్రూపును ఇరాన్ తీవ్రంగా పరిగణించింది. ఈ క్రమంలో తాజాగా జైష్ అల్ ఆదిల్ స్థావరాలపై దాడులకు పాల్పడింది. ప్రస్తుతం పాక్ చెరలో ఉన్న భారత నౌకాదళ మాజీ అధికారి కుల్‌భూషణ్ జాదవ్‌ను ఈ గ్రూపే కిడ్నాప్ చేసి, పాక్ గూఢచర్య సంస్థకు విక్రయించిందని కూడా నిఘా వర్గాల సమాచారం

హమాస్-ఇజ్రాయెల్ యుద్ధంలోకి ఇరాన్!

హమాస్-ఇజ్రాయెల్ యుద్ధంలో ఇప్పటికే వేలాది మంది మరణించారు. ఈ యుద్ధం ఇప్పట్లో ముగిసే సంకేతాలు ఏవీ కనిపించడం లేదు. ఇప్పటి వరకు తాము మద్దతిచ్చే మిలిటెంట్ గ్రూపులతో దాడులు చేయించిన ఇరాన్.. ఇప్పుడు హమాస్-ఇజ్రాయెల్ యుద్ధ రంగంలోకి నేరుగా దిగినట్టు కనిపిస్తున్నది. ఇరాక్, సిరియాలపై సోమవారం క్షిపణులతో దాడులు చేసింది. ఉత్తర ఇరాన్‌లోని ఇర్బిల్‌లో ఉన్న ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్‌కు చెందిన ముఖ్య కార్యాలయంపై బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. మరోవైపు సిరియాలోని ఐసిస్ స్థావరాలపైనా దాడులు చేశామని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. ఇడ్లిబ్‌లోని తీవ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామని పేర్కొన్నది. కెర్మాన్ నగరంలో ఈ నెల 3న జరిగిన జంట ఆత్మాహుతి బాంబు దాడులకు ప్రతీకారంగా ఇరాన్ ఈ దాడులు చేసినట్టు తెలుస్తున్నది.

గాజా సరిహద్దులో ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకు

అయోధ్యకు చేరుకున్న రామ్‌లల్లా

- జై శ్రీరామ్ నినాదాలతో దద్దరిల్లిన మందిర ప్రాంగణం
- నేడు గర్భగుడిలోకి ప్రవేశం
- రాములోరికి ఘనంగా కలశ పూజ

కవరు కప్పిన లారీలో రామ్‌లల్లా విగ్రహాన్ని అయోధ్య రామమందిరానికి తీసుకొస్తున్న దృశ్యం

అయోధ్య, జనవరి 17: అయోధ్య రామాలయంలో ప్రతిష్ఠించనున్న రామ్‌లల్లా విగ్రహం బుధవారం ఆలయ ప్రాంగణానికి చేరుకుంది. ట్రక్కులో విగ్రహం రాగానే జై శ్రీరామ్ నినాదంతో ప్రాంగణం దద్దరిల్లింది. క్రేన్ సహాయంతో విగ్రహాన్ని గుడిలోకి చేర్చారు. గురువారం ఆలయ గర్భగుడిలోకి విగ్రహాన్ని తెస్తారు. కాగా, వెండితో చేసిన ఒక రామ్ లల్లా విగ్రహాన్ని ఆలయ ప్రాంగణంలో బుధవారం ఊరేగించారు. పూజారి నెత్తిపై కలశాన్ని ఉంచుకుని ముందు నడుస్తుండగా, పూలతో అలంకరించిన పల్లకిలో ఈ వెండి విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించారు. అంతకుముందు ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాలలో భాగంగా అయోధ్యలో కలశ పూజ ఘనంగా నిర్వహించారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యుడు అనిల్‌మిశ్రా దంపతులు సరయు నది ఒడ్డున దీనిని భక్తి శ్రద్ధలతో చేపట్టారు. అనంతరం కలశాలలో సరయు నది నీటిని రామమందిరానికి తీసుకుని వెళ్లారు. కాగా, గురువారం అయోధ్య రామ మందిరం గర్భగుడిలోకి బాల రాముడి విగ్రహాన్ని తీసుకువస్తారు. దీంతో తీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యులతో పాటు నిర్మోహి అఖాడాకు చెందిన మహంత్ దినేంద్ర దాస్, పూజారి సునీల్ దాస్ విగ్రహాన్ని ప్రతిష్ఠించే ప్రదేశం వద్ద పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు.

అయోధ్య రామునికి పద్మనాభుని విల్లు

ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాన్ని పురస్కరించుకుని కేరళలోని శ్రీ పద్మనాభ స్వామి దేవాలయం అయోధ్య రామునికి సంప్రదాయ ఆచార విల్లు 'ఓనవిల్లు'ను బహూకరించనుంది. ఈ నెల 18న అయోధ్యలో దీనిని ఆలయ నిర్వాహకులు అయోధ్య ట్రస్ట్‌కు అందజేస్తారు.

జనవరి 22 తర్వాతే: కేజ్రీవాల్

తన కుటుంబంతో సహా వెళ్లి అయోధ్య రాముడిని దర్శించుకుంటానని, అయితే జనవరి 22 తర్వాత ఆ పనిచేస్తానని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బుధవారం తెలిపారు. ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ సైతం ప్రాణ ప్రతిష్ఠ జరిగిన తర్వాతే అయోధ్య రాముడిని దర్శించుకుంటానని తెలిపారు. ఈ నెలలో అయోధ్య ప్రాణ ప్రతిష్ఠకు వెళ్లే ఉద్దేశం లేదని ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ స్పష్టం చేశారు.

ప్రాణ ప్రతిష్ఠను రద్దు చేయాలంటూ పిల్

అయోధ్యలో చేపట్టే ప్రాణ ప్రతిష్ఠను వెంటనే నిలిపివేయాలని యూపీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ కార్యక్రమం పూర్తిగా రాజకీయ ప్రయోజనానికి ఉద్దేశించినదని, దీనిని వెంటనే రద్దు చేయాలని యూపీ ఘజియాబాద్‌కు చెందిన భోలాద దాస్ ఈ పిల్ దాఖలు చేశారు.

రన్‌వేపై భోజనం.. ఇండిగోకు 1.2 కోట్ల జరిమానా

న్యూఢిల్లీ: ఇండిగోకు ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల ముంబై విమానాశ్రయంలో ఇండిగో విమానం పక్కనే రన్‌వేపై కూర్చుని ప్రయాణికులు ఆహారాన్ని భుజించిన ఘటనపై డీజీసీఏ సీరియస్ అయ్యి ఇండిగోకు రూ.1.20 కోట్లు, బాంబే ఎయిర్‌పోర్టుకు 90 లక్షల జరిమానా విధించింది. నియమాలు ఉల్లంఘించినందుకు జరిమానా విధించినట్టు డీజీసీఏ, బీసీఏఎస్ తెలిపింది. పైలట్ రోస్టరింగ్‌లో లోపాలకు ఎయిరిండియా, స్పైస్‌జెట్ సంస్థలకు తలా రూ.30 లక్షల జరిమానా విధించింది.

సీపీఆర్ ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ రద్దు

న్యూఢిల్లీ : దేశంలో అత్యున్నత స్వచ్ఛంద సంస్థల్లో ఒకటైన సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ (సీపీఆర్)కు భారీ దెబ్బ తగిలింది. ఈ సంస్థ విదేశీ విరాళాలను స్వీకరించడానికి సంబంధించిన రిజిస్ట్రేషన్‌ను కేంద్ర హోం శాఖ రద్దు చేసింది. విదేశీ విరాళాల స్వీకరణకు చెందిన ఎఫ్‌సీఆర్‌ఏ చట్టాన్ని ఉల్లంఘించినందుకే రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తున్నట్టు వెల్లడించింది. ఈ ప్రకటనపై సీపీఆర్ స్పందిస్తూ రిజిస్ట్రేషన్ రద్దుపై న్యాయపోరాటానికి వెనుకాడమని స్పష్టం చేసింది.

విమాన టాయిలెట్‌లో చిక్కుకున్న ప్రయాణికుడు

న్యూఢిల్లీ, జనవరి 17: బెంగళూరు వెళ్లేందుకు ముంబైలో స్పైస్‌జెట్ విమానమెక్కిన ప్రయాణికుడికి చేదు అనుభవం ఎదురైంది. విమానం టాయిలెట్‌లో ఇరుక్కుపోయి బెంగళూరులో విమానం ల్యాండయ్యే వరకు అందులోనే కూర్చుని ప్రయాణించాల్సి వచ్చింది. ప్రయాణికుడికి ఎయిర్‌లైన్ సంస్థ క్షమాపణలు చెప్పడంతోపాటు టికెట్ మొత్తాన్ని వెనక్కి ఇచ్చేసింది. విమానం బెంగళూరులో ల్యాండయ్యాక ఇంజినీర్లు టాయిలెట్ తలుపులు తెరిచి అతడిని రక్షించారు. ఈ నెల 16న ఈ ఘటన జరిగిందని, మాల్‌ఫంక్షన్ కారణంగా డోర్‌లాక్ అయిందని స్పైస్‌జెట్ పేర్కొంది. ప్రయాణికుడు బయటకు వచ్చేంత వరకు తమ సిబ్బంది అతడితో మాట్లాడుతూనే ఉన్నారని, బెంగళూరులో అతడికి వైద్య సాయం కూడా అందించినట్టు తెలిపింది. ప్రయాణికుడి టికెట్ డబ్బులు వాపస్ ఇచ్చినట్టు స్పైస్‌జెట్ చెబుతున్నప్పటికీ, డిసెంబరులో రద్దైన విమానాలకు సంబంధించి టికెట్ డబ్బులు వెనక్కి ఇవ్వలేని పలువురు ప్రయాణికులు ఎక్స్ ద్వారా ఆగ్రహం వ్యక్తం చేశారు.

కెనడాకు వెళ్లే భారత విద్యార్థుల్లో 86% తగ్గుదల

- ఇరు దేశాల మధ్య దౌత్య ఉద్రిక్తతలే కారణం

టొరంటో, జనవరి 17: భారత్-కెనడా మధ్య నెలకొన్న దౌత్య ఉద్రిక్తతలు.. భారత విద్యార్థులపై గణనీయంగా ప్రభావం చూపాయి. ఆ దేశానికి వెళ్లేందుకు భారతీయ విద్యార్థులు వెనుకాడుతున్నారు. కెనడా కాకుండా ఇతర దేశాల్లో ఉన్నత విద్య చదవటంపై ఆసక్తి కనబరుస్తున్నారు. కెనడాకు వెళ్లే భారత విద్యార్థుల సంఖ్య 2023లో 86 శాతం వరకు పడిపోయిందని ఆ దేశానికి చెందిన ఉన్నతాధికారి ఒకరు తాజాగా మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. ఏటా కెనడా జారీచేసే స్టూడెంట్ వీసాల్లో అత్యధిక వాటా భారతీయ విద్యార్థులదే. 2022లో కెనడా జారీచేసిన స్టూడెంట్ వీసాల్లో 41శాతం (2,25,835) భారత్‌కు చెందినవే ఉన్నాయి. అయితే కొద్ది నెలల క్రితం కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో భారత్‌పై చేసిన ఆరోపణలతో ఇరు దేశాల సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇరు దేశాల్లోనూ దౌత్య సిబ్బందిపై వేటు పడింది. దీనిపై కెనడా ఇమ్మిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ మాట్లాడుతూ, 'కెనడాకు వచ్చే భారతీయ విద్యార్థుల సంఖ్య హఠాత్తుగా పడిపోవటానికి కారణం రెండు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తత. కెనడా దౌత్య సిబ్బందిని భారత్ బహిష్కరించటం వల్ల, స్టూడెంట్ వీసా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ సగానికి పడిపోయింది' అని అన్నారు. గతేడాదితో పోల్చితే భారతీయులకు కెనడా జారీచేసిన స్టడీ పర్మిట్ల సంఖ్య 2023 నాలుగో త్రైమాసికంలో 1,08,940 నుంచి 14,910కి పడిపోయింది.

లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ

పంజాబ్ సీఎం భగవంత్ మాన్

చండీగఢ్, జనవరి 17: ప్రతిపక్ష ఇండియా కూటమిలో విభేదాలు ముదురుతున్నాయి. కూటమి భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, ఆప్ మధ్య వైరం పెరుగుతున్నది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేస్తే స్థానాలపై ఓ వైపు చర్చలు జరుగుతుండగానే.. పంజాబ్‌లో అన్ని లోక్‌సభ స్థానాల్లో ఒంటరిగానే పోటీచేస్తామని ఆ రాష్ట్ర సీఎం, ఆప్ నేత భగవంత్ సింగ్ మాన్ ప్రకటించడం చర్చనీయాంశమైంది. మొత్తం 13 స్థానాల్లో విజయం సాధించి పంజాబ్‌లో చరిత్ర సృష్టిస్తామని మాన్ తెలిపారు. కాంగ్రెస్ నేత ప్రతాప్ సింగ్ బజ్వా స్పందిస్తూ కేజ్రీవాల్, భగవంత్ మాన్‌ను హిట్లర్‌తో పోల్చారు.

'లోక్‌సభ'లో గెలిస్తేనే ఐదేండ్లు!

అప్పుడే సీఎంగా సిద్ధరామయ్య ఐదేండ్లు కొనసాగుతారు: యతీంద్ర

బెంగళూరు: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో 'సీఎం మార్పు' అంశం మరోసారి తెరపైకి వచ్చింది. సీఎం సిద్ధరామయ్య కుమారుడు, మాజీ ఎమ్మెల్యే యతీంద్ర చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. హసన్‌లో బుధవారం యతీంద్ర మాట్లాడుతూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు గెలవడం ద్వారా తన తండ్రి సిద్ధరామయ్య ఎలాంటి 'అడ్డంకులు' లేకుండా ఐదేండ్ల పాటు సీఎంగా కొనసాగుతారని, గ్యారెంటీ పథకాలు అమలవుతాయని అన్నారు. సీఎం సిద్ధరామయ్య పదవీకాలంపై యతీంద్ర చేసిన వ్యాఖ్యలను వక్రీకరించాల్సిన అవసరం లేదని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు. అటు యతీంద్ర వ్యాఖ్యలపై బీజేపీ నేత అశోక మాట్లాడుతూ సీఎంగా సిద్ధరామయ్యకు రోజుల లెక్కింపు ప్రారంభమైందనేది ఇక రహస్యంగా ఉండబోదని అన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఆయనకు ఆ పార్టీ హైకమాండ్ 'ఎగ్జిట్ డోర్' చూపిస్తుందని పేర్కొన్నారు.

మణిపూర్‌లో మళ్లీ హింస

బాంబు దాడిలో ఇద్దరు పోలీస్ కమెండోల మృతి

ఇంఫాల్: మణిపూర్‌లో మళ్లీ అశాంతి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తెంగ్నోపాల్ జిల్లాలోని సరిహద్దు పట్టణం మోరేలో భద్రతా బలగాల తాత్కాలిక పోస్ట్‌పై మిలిటెంట్లు దాడులు చేశారు. కుకీ మిలిటెంట్లుగా భావిస్తున్న వారు చేసిన ఈ దాడిలో ఇద్దరు పోలీస్ కమెండోలు మృతి చెందారు. దీంతో మిలిటెంట్లకు భద్రతా దళాలకు మధ్య కాల్పులు కొనసాగాయి. ఈ తాత్కాలిక పోస్ట్‌పై మిలిటెంట్లు బాంబులతో దాడి చేసి కాల్పులు జరపడమే కాక ఆర్పీజీ షెల్స్ ప్రయోగించారు. పలు వాహనాలు ధ్వంసం అయ్యాయి.

జనవరిలో 7,500 మంది టెక్ ఉద్యోగుల తొలగింపు

న్యూఢిల్లీ: టెక్ కంపెనీలు భారీగా ఉద్యోగాల తొలగింపును కొనసాగిస్తున్నాయి. కొత్త ఏడాదిలో ఇప్పటివరకూ.. 51 టెక్ కంపెనీల్లో సుమారుగా 7,500 మంది ఉద్యోగుల్ని తొలగించారని 'రాయటర్స్' వార్తా కథనం పేర్కొన్నది. ఈ ఏడాది గూగుల్, అమెజాన్ కంపెనీలు వందలాది మంది ఉద్యోగుల్ని తొలగించాయి. ఉద్యోగాల కోత ప్రస్తుతానికి స్వల్పంగా కనిపిస్తున్నా.. ఈ ఏడాది ముందు ముందు పెద్ద సంఖ్యలో లేఆఫ్‌లు ఉండబోతున్నాయని టెక్ నిపుణులు అంచనావేస్తున్నారు.

14 ఏండ్లు పైబడినా ఎల్‌కేజీ స్థాయి చదువులే!

- *కనీసం 2వ తరగతి పుస్తకాలనూ చదవలేని దైన్యం*
- *విద్యారంగ డొల్లతనాన్ని బయటపెట్టిన అసర్ సర్వే*

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ)/న్యూఢిల్లీ: ప్రపంచానికి ఎంతో మంది మేధావులను అందించిన భారత్‌లో విద్యారంగం నానాటికీ కుంటుపడుతున్నదా? ఈ ప్రశ్నకు అవుననే సమాధానమే వినిపిస్తున్నది. దేశంలోని 14-18 ఏండ్ల యువతలో 86.8% మంది బడుల్లో చేరినప్పటికీ వారిలో 25 శాతం మంది తమ ప్రాంతీయ భాషల్లో కనీసం రెండో తరగతి పాఠ్యపుస్తకాలను కూడా అనర్గళంగా చదవలేకపోతున్నట్టు విద్యారంగ వార్షిక స్థితిగతుల నివేదిక(ఏఎస్ఈఆర్-అసర్) వెల్లడించింది. దేశీయంగా 26 రాష్ట్రాల్లోని 28 జిల్లాల్లో ప్రథమ్ ఫౌండేషన్ సంస్థ ఈ సర్వేను నిర్వహించింది. మూడు అంకెలను ఒక అంకెతో భాగించలేని వారు 50 శాతానికి పైగా ఉన్నారు. కేవలం 43.3 శాతం విద్యార్థులు 3, 4 తరగతుల్లో వాడే ఈ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కేవలం 57.3 శాతం విద్యార్థులు మాత్రమే ఇంగ్లిష్ పదాలను చదవగలుగుతున్నారని నివేదిక పేర్కొన్నది. 2022లో 14 ఏండ్ల వయస్కుల్లో 3.9% మంది, 18 ఏండ్లు లేదా అంతకంటే ఎక్కువ వయసున్న వారిలో 32.6% మంది అసలు విద్యాసంస్థల్లోనే చేరలేదని నివేదిక తేల్చింది. 11, 12 తరగతుల విద్యార్థుల్లో 55.7% మంది ఆర్ట్స్ అండ్ హ్యుమానిటీస్ స్ట్రీమ్‌ను ఎంచుకున్నట్టు తెలిపింది. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ (స్టెమ్) స్ట్రీమ్‌ను ఎంచుకునేందుకు యువతులు ఆసక్తి చూపడం లేదని, 2022లో కేవలం 28.1% మంది యువతులు, 36.3% మంది యువకులు 'స్టెమ్' స్ట్రీమ్‌లో చేరారని పేర్కొన్నది. 5.6% యువత మాత్రమే వృత్తి శిక్షణ లేదా సంబంధిత కోర్సుల్లో చేరినట్టు స్పష్టం చేసింది. కొవిడ్ సంక్షోభ సమయంలో చాలా కుటుంబాలు జీవనోపాధిని కోల్పోవడం వల్ల ఎంతో మంది పాత విద్యార్థులు బడుల నుంచి తప్పుకున్నారన్న వాదన నిరాధారమైనదని పేర్కొన్నది. 2022లో పాఠశాలల్లో చేరిన 6-14 ఏండ్ల పిల్లల శాతం గతంలో కంటే మెరుగుపడినట్టు వెల్లడించింది. 2010 సంవత్సరంలో 96.6, 2014లో 96.7, 2018లో 97.2 శాతంగా ఉన్న ఈ రేటు 2022లో 98.4 శాతానికి పెరిగినట్టు అసర్ వివరించింది. 17-18 ఏండ్ల మధ్య వయస్కుల్లో 23.9 శాతం విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారు.

ఖమ్మంలో విద్యార్థుల అభిప్రాయ సేకరణ

సర్వేలో భాగంగా రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలో విద్యార్థుల అభిప్రాయాలు సేకరించారు. పోలీస్, టీచర్, ఇంజినీర్, డాక్టర్... భవిష్యత్తులో ఏమవుతామంటే అత్యధిక మంది నోటి నుంచే వచ్చే ఉద్యోగాల పేర్లు ఇవే. పోలీసు అవ్వాలని ఉన్నదని 4% మంది అమ్మాయిలు, 9.8% మంది అబ్బాయిలు ఆకాంక్ష వెలిబుచ్చారు. టీచర్ అవుతామన్న వారిలో అత్యధికంగా 15.5 శాతం అమ్మాయిలుంటే, 8.9 శాతం అబ్బాయిలున్నారు. ఇక డాక్టర్ అవుతామన్న వారిలో 14.2 శాతం అమ్మాయిలుంటే, 4.4 శాతం అబ్బాయిలున్నారు.

భారత భూగర్భంలో సంఘర్షణ

- *ఇండియన్ టెక్టోనిక్ ఫలకలో చీలిక*
- *పైకి పెరుగుతున్న హిమాలయాలు*
- *టిబెట్ రెండు ముక్కలయ్యే చాన్స్*

శాన్‌ఫ్రాన్సిస్కో, జనవరి 17: పైన అంతా ప్రశాంతం.. లోలోపల అంతా సంఘర్షణ; పైన మంచుతో చల్లని వాతావరణం.. లోలోపల భీకర వాతావరణం.. ఇదీ హిమాలయ పర్వత శ్రేణుల పరిస్థితి. హిమాలయాలు అన్న పేరు వినగానే మనసుకు హాయి. కానీ హిమాలయాల అంతర్భాగంలో భారీ యుద్ధమే జరుగుతున్న దట. కారణం ఏమిటంటే.. భారత టెక్టోనిక్ ఫలకలో చీలిక వస్తుండటమే. యురేషియన్ టెక్టోనిక్ ఫలకతో నిత్య సంఘర్షణ ఫలితంగా హిమాలయ పర్వత శ్రేణులు మరింత ఎత్తుకు పెరిగి, ఆ ప్రాంతంలో ఉన్న టిబెట్ రెండు ముక్కలయ్యే అవకాశం ఉన్నది. శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన అమెరికన్ జియోఫిజికల్ యూనియన్ వార్షిక సమావేశంలో భూగర్భశాస్త్ర నిపుణులు భారత టెక్టోనిక్ ఫలక సంఘర్షణ ప్రభావాన్ని వివరించారు.

ఏ క్షణమైనా భారీ భూకంపం?

భారత టెక్టోనిక్ ప్లేట్ ఏటా సుమారు 5 స